క్లుప్తంగా

సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడి

పెద్దకొత్తపల్లి: మామిడి తోటల పెంపకంలో సేంద్రియ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని సేంద్రియ వ్యవసాయ శాస్త్రవేత్తలు శాంతికుమార్, రంజిత్ అన్నారు. పెద్దకొత్తపల్లి సమీపంలో రైతు వెంకట్‌రెడ్డి సాగుచేసిన మామిడి తోటను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేంద్రియ పద్ధతిలో మామిడి సాగుతో నాణ్యమైన దిగుబడి ఉంటుందన్నారు. తద్వారా రైతుకు మంచి లాభాలు ఉంటాయని తెలిపారు. తోటల సాగులో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు.

గ్రామ పంచాయతీగా గుర్తించాలి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని గేమ్యానాయక్ తండాను గ్రామ పంచాయతీగా గుర్తించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వర్ధం పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గేమ్యానాయక్ తండాలో సీపీఎం రెండో శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. గ్రామ పంచాయతీగా అన్ని అర్హతలు ఉన్నా గుర్తించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శివవర్మ, తారాసింగ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

మన్ననూర్: స్థానిక గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో గ్రామంలోని వివిధ కాలనీల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆదివారం రాత్రి ఉమామహేశ్వర, జంగాల, అంబేడ్కర్, లింగమయ్య, పాతబజార్ కాలనీలతో పాటు వేణుగోపాల స్వామి ఆలయం పరిసరాల్లో దోమల నివారణకు గ్రామ కార్యదర్శి భీముడు ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సిబ్బంది సురేష్, మల్లయ్య, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

కోడేరు: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహా విడుదల చేశారు. కార్యక్రమంలో రవి, రాజేష్, రాజు, చంద్రయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చారకొండ: మండలంలోని జూపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎండీ నజీర్ కుటుంబానికి సింగిల్ విండో వైస్ చైర్మన్ సంజీవ్ యాదవ్ రూ.5 వేలు, లింగారెడ్డిపల్లి మహ్మద్ అలీ రూ.2 వేలు సమకూర్చారు. ఈ మేరకు సోమవారం జూపల్లి కాంగ్రెస్ యువజన నాయకుడు ఎండీ సిరాజ్ బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు సాధిక్, శ్రీను, యుగంధర్, తదితరులు ఉన్నారు.

వెల్దండ: మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన కొమ్ము వెంకటయ్య అనారోగ్యానికి గురయ్యాడు. బీఆర్‌ఎస్ నాయకుడు కొండల్ యాదవ్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి ఆసత్రి ఖర్చుల కోసం రూ.3వేలు ఆర్థికసాయం అందజేశారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతాం

తెలకపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని కార్వంగలో సీపీఎం గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను నిరంతరం అధ్యయనం చేసి పరిష్కారం కోసం పోరాడుతామన్నారు. గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా గోపస్ లక్ష్మణ్, నాయకులు నందిపేట భాస్కర్, గోరటి కాశన్న, కృష్ణయ్య, ఆంజనేయులు, గాజుల శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.


కల్వకుర్తిలో..


దోమల పెంటలో.

గంగమ్మ ఒడికి గణపయ్య

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా కొలువుదీరిన గణనాథులను సోమవారం పలు మండలాల్లో నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. అదేవిధంగా కొన్ని చోట్ల వినాయకులకు ప్రత్యేక పూజలు చేశారు. కల్వకుర్తిలో యువతీ, యువకులు కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. వినాయకులను వీధులలో ఊరేగించారు. న్యాయవాది బీజేపీ లీగల్ సెల్ సభ్యుడు కరుణాసాగర్ మండపాలను సందర్శించారు. చారకొండలో మహిళలు కోలాటాల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేశారు. దోమలపెంట శ్రీశైలం ప్రధాన రహదారిపై బాణాసంచా కాల్చారు. గణనాథుడిని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఊర్కొండ మండలంలోని ముచ్చర్లపల్లిలో లడ్డూను ధర్మారెడ్డి రూ.2,86,000లకు దక్కించుకున్నాడు. చారకొండ మండలంలోని జూపల్లిలో వరుసగా 20వ సారి లడ్డూను వ్యాపారి భిక్షపతి యాదవ్ కైవసం చేసుకున్నారు. రూ.10 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.


చారకొండలో నిమజ్జనోత్సవానికి హాజరైన మహిళలు, భక్తులు

పూజలందుకుంటున్న గణనాథులు

తెలకపల్లి, తాడూరు, లింగాల, చారకొండ మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో వినాయకులకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. లింగాల, తాడూరులో అన్నదానం చేశారు. చిన్నారులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. తెలకపల్లి మండలంలోని పెద్దపల్లిలో లంద ఎల్లస్వామి, లంద రాము, ఆలేటి మల్లేష్‌లు కలిసి రూ. 21వేలతో 116 కిలోల లడ్డూను ఏర్పాటు చేశారు.


లింగాలలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు


తాడూరులో ..


ఊర్కొండలో..


అమ్రాబాద్‌లో ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు


పెంట్లవెల్లిలో ..

ప్రత్యేక ప్రార్థనలు, ర్యాలీలు


వెల్దండలో..


మన్ననూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా సోమవారం భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు స్థానిక మసీదుల్లో జాగారం చేశారు. మత పెద్దలు ప్రవక్త సందేశాన్ని వినిపించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొల్లాపూర్, తెలకపల్లి, వెల్దండ, అమ్రాబాద్, పెంట్లవెల్లి, మన్ననూర్‌లో ర్యాలీ నిర్వహించారు. దోమలపెంటలో పండుగ విశిష్టతను వివరించారు. పలు మసీద్‌లలో అన్నదానం చేశారు. లింగాల మండలంలోని అంబట్‌పల్లి జామా మసీద్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు.


తెలకపల్లి మండలం గౌరారంలో ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు


దోమల పెంటలో..

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తీగల వెంకటస్వామి ఫంక్షన్ హాల్‌లో క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వాస రాఘవేందర్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, సన్మాన గ్రహీతలు, ఉపాధ్యాయులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన నాగోలు ప్రమీలమ్మ ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులను సోమవారం పరామర్శించి ప్రమీలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రమీలమ్మ పేదల కోసం చేసిన పోరాటాలను మరిచిపోలేమన్నారు. అనంతరం గ్రామానికి చెందిన వాడాల కౌసల్య దశదిన కర్మలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వెల్గొండ గ్రామస్తులు ఉన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట


వెల్దండలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి మందులను అందజేస్తున్న వైద్యులు

వెల్దండ: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. సిబ్బంది కొరత ఉందని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా అధికారులతో మాట్లాడి వెల్దండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్‌ను నియమించడానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. తాత్కాలికంగా చారకొండ మెడికల్ ఆఫీసర్ వెల్దండ ఆస్పత్రిలో విధులు నిర్వహించేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వార్డులోని రోగులను పరామర్శించి వైద్యం సక్రమంగా అందుతుందా అని తెలుసుకున్నారు. అనంతరం స్టాక్, సిబ్బంది వివరాలను పరిశీలించారు. ఆస్పత్రిలో ఎమ్మెల్యే వైద్య పరీక్షలు చేసుకొని మందులను తీసుకొన్నారు.

మసీద్ అభివృద్ధికి కృషి

మండల కేంద్రంలోని మసీద్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మసీద్‌కు చేరుకొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మసీద్ అభివృద్ధికి రూ.5 లక్షలు మంజూరు చేశారు.

ఆటోమొబైల్ దుకాణం ప్రారంభం

వెల్దండలో శివగాడు ఆటోమొబైల్ దుకాణాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. యువకులు స్వయం ఉపాధి రంగాలపై దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భీమనాయక్, చారకొండ మెడికల్ ఆఫీసర్ మంజూభార్గవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్లు సంజీవ్‌కుమార్‌యాదవ్, మట్ట వెంకటయ్యగౌడ్, నాయకులు పర్వత్‌రెడ్డి, నారాయణ, పత్యానాయక్, రషీద్, మైనార్టీ మండల అధ్యక్షులు రషీద్,సాధిక్, హమీద్, సాదిక్, వాజీద్, ఖలీల్, వలీయోదిన్ ఉన్నారు.

దేవాలయ అభివృద్ధికి చేయూత



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ అభివృద్ధికి సహకరించాలని బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు మధును సోమవారం స్వర్ణకారుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆయన రూ.50,520లు ఆ సంఘం అధ్యక్షుడు వేణుకు నగదు అందజేశారు. కార్యక్రమంలో రమేష్ చారి పాల్గొన్నారు.

ఘనంగా నాయీ బ్రాహ్మణ దినోత్సవం



వెల్దండ: మండల కేంద్రంలో సోమవారం ప్రపంచ నాయీ బ్రాహ్మణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి కానుగుల వెంకట్ రాములు, ప్రధాన కార్యదర్శి తిరుమలేష్ లు కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి ప్రసాద్, నాయకులు వెంకటయ్య, సర్వయ్య, శ్రీనివాసులు, నరేష్, రవి, శ్రీను, శ్రీకాంత్, మహేష్, ప్రసాద్, నవీన్ తదితరులు ఉన్నారు.

వైద్యులను నియమిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలపై 'రోగులకు వైద్యం అందేనా' అనే శీర్షికతో ఈనెల 15న సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితం అయ్యింది. దీంతో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భీమానాయక్ స్పందించి సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పీహెచ్‌సీలోని వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులకు ఇబ్బంది లేకుండా డాక్టర్‌ను నియమిస్తామన్నారు. స్టాఫ్‌నర్స్, ఇతర సిబ్బంది ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామన్నారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ భార్గవి, సిబ్బంది లక్ష్మణ్, మురళి, గోవర్ధన్, ఏఎన్‌ఎంలు, తదితరులు ఉన్నారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భీమానాయక్

ఉపాధ్యాయులకు ఘన సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్‌లో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సోమవారం సింగిల్‌విండో డైరెక్టర్లు సంజీవ్‌కుమార్ యాదవ్, మట్ట వెంకటయ్యగౌడ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు రషీద్‌లు సన్మానించారు. దాదాపుగా ఉపాధ్యాయులు 12 ఏళ్లుగా సేవలందించడం గొప్ప విషయమన్నారు. బదిలీపై ఉపాధ్యాయులు వెళ్తుండటంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కంటతడి పెట్టారు. ఉపాధ్యాయులు భావోద్వేగానికి గురయ్యారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, కాంగ్రెస్ నాయకులు పర్వత్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, సంజీవ్‌కుమార్, మట్ట వెంకటయ్య గౌడు, నారాయణ, పత్యనాయక్, రామస్వామి, భరత్‌గౌడ్, ప్రిన్సిపాల్ పుష్పలత, వైస్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, ఉపాధ్యాయులు భిచ్చయ్య, మల్లేష్ ఉన్నారు.

రైతుభరోసా నిధులు విడుదల చేయాలి


మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: వానాకాలానికి సంబంధించి రైతు భరోసా నిధులు మంజూరు చేయాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరిస్తోందని విమర్శించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో వేలాది మంది రైతులకు రుణమాఫీ కాలేదని, వారందరికీ న్యాయం చేయాలని ఆయన కోరారు. పేదలకు ఆసరా పించన్లు కూడా సకాలంలో అందడం లేదన్నారు. దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు చేపట్టాలని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని ఆయన కోరారు.

రేపు సామూహిక వ్రతాలు

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో ఉన్న సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఈ నెల18న బుధవారం ఉదయం 11 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు రామాలయ ప్రధాన అర్చకుడు కందడై వరదరాజన్ అయ్యంగార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్: 9440981253 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు జాతీయ జెండావిష్కరణ

ఉప్పునుంతల: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం 8.40 గంటలకు మండల ప్రత్యేకాధికారి స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఎగురవేస్తారని ఎంపీడీఓ మోహన్‌లాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, అన్ని శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గొర్రెల కాపరి అదృశ్యంపై కేసు నమోదు

అమ్రాబాద్: గొర్రెల కాపరి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సోమవారం పదర ఎస్‌ఐ రాజు తెలిపారు. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌నగర్‌జిల్లా కౌకుంట్ల మండలం పుట్టపల్లి గ్రామానికి చెందిన బీచుపల్లి శేఖర్ తోటి కాపరులతో కలిసి జీవాలను పదర మండలం ఇప్పలపల్లి అటవీ ప్రాంతానికి ఈ నెల 1న తీసుకొచ్చాడు. 13న జీవాల మేత కోసం వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. తోటి కాపరులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం శేఖర్ తమ్ముడు శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నిరుపయోగంగా గ్రంథాలయం


ఉప్పునుంతల గ్రంథాలయం

ఉప్పునుంతల: మండల కేంద్రంలో ఉన్న శాఖా గ్రంథాలయానికి రెగ్యులర్ లైబ్రేరియన్ లేకపోవడంతో పాఠకులకు ఏమాత్రం ప్రయోజనం చేకూరడం లేదు. పదేళ్ల గడిచినా పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. లైబ్రేరియన్ లేకపోవడంతో పుస్తకాల గదికి ఎప్పుడు తాళం వేసి ఉంచుతున్నారు. దీంతో పాఠకులు గ్రంథాలయానికి వచ్చేందుకు ఆసక్తి చూపటం లేదు. అక్కడకు వచ్చే ఒకటి, రెండు దినపత్రికలకు మాత్రమే పరిమితకావడంతో ఉదయం కొంతమంది యువకులు ఆవరణలో కూర్చొని పత్రికలను చూసి వెళ్లే పరిస్థితి దాపురించింది. పోటీ పరీక్షలకు ఉపయోగపడే వార్త, మాస పత్రికలు ఏమాత్రం అందుబాటులో ఉంచడం లేదని విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు వాపోతున్నారు.

రెండువేలకు పైగా పుస్తకాలు..

గ్రంథాలయంలో మహనీయులకు సంబంధించిన పుస్తకాలతోపాటు మహాభారతం, పంచతంత్రం, విశ్వరహస్యం, నవలలు, కవిత్వాలు తదితర రెండు వేలకు పైబడి పుస్తకాలు ఉన్నా ఎవరికీ ఉపయోగపడటంలేదు. విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని ఆసక్తి ఉన్నా పుస్తకాలు ఉన్న గదికి తాళం వేసి ఉంచడంతో చదవలేక పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం సెలవు దినాల్లోనూ గ్రంథాలయంలోని పుస్తకాలు చదివే అవకాశం కూడా లేదని వారు వాపోతున్నారు.

పుస్తకాలపై దుమ్ము..

అచ్చంపేట లైబ్రేరియన్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో ఆమె నెలలో ఒకటి రెండు పర్యాయాలు మాత్రం ఇక్కడకు వచ్చి వెళ్తోంది. కేవలం పేపర్ బిల్లులు ఇవ్వడానికి మాత్రమే ఇన్‌చార్జి లైబ్రేరియన్ వచ్చి వెళ్తారని పాఠకులు పేర్కొంటున్నారు. పుస్తకాలు చదువుకునే వీలులేకుండా పోయిందని వాపోతున్నారు. నెలల తరబడి పుస్తకాలను కదిలించకపోవడంతో విలువైన పుస్తకాలను చెదలు పట్టిపోయాయి. ఇప్పటికే చాల పుస్తకాలు పాడు కావడంతో వాటిని మూలన పడేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో గ్రంథాలయం నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని విమర్శలు వినిపిస్తున్నాయి.

లైబ్రేరియన్ నియమిస్తే ప్రయోజనం



స్థానిక గ్రంథాలయానికి రెగ్యులర్ లైబ్రేరియన్ నియమిస్తే పదిమందికి ప్రయోజనం చేకూరుతుంది. కొన్నేళ్లుగా గ్రంథాలయంలో పుస్తకాలను ఇంటికి తీసుకొని చదువుకునే పరిస్థితి లేకుండా పోయింది. గ్రంథాలయం ఎవరికీ ఉపయోగపడటంలేదు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఫలితంలేదు. – అనుపటి నాగరాజు, నిరుద్యోగి యువకుడు, ఉప్పునుంతల